
# తీయని జ్ఞాపకం

శ్రీమతి న్యాయపతి కమలారాంజీ

ఆదిత్య సుప్రియని సరిగ్గా పన్నెండు సంవత్సరాల తర్వాత ఒక ఫంక్షన్‌లో చూశాడు. ఆమెని చూసిన వెంటనే అతని కళ్ళు సంతోషంతో వింతగా మెరిశాయి. తెల్లగా, పుష్టిగా, చక్కని శరీర సౌష్టవంతో, అందమైన ముఖవర్ఛస్సుతో మెరిసిపోతున్న సుప్రియని చూడగానే ఆదిత్య తన చూపుల్ని మరోకవైపుకి మరల్చుకోలేకపోయాడు.

ఆమె అలంకరణ సింపుల్‌గా వున్నా ఆమెలో ఏదో ప్రత్యేక ఆకర్షణ కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ఆమేనా కాదా అని ఒక్క నిమిషం సంశయించాడు. కాని ఆ చూపు, ఆ నడక, ఆ నవ్వు ఎన్ని సంవత్సరాలైనా ఆమెని తను పోల్చుకోగలడు. తమ బంధం అలాంటిది...





చిన్నప్పటినుంచీ ఇద్దరిదీ పక్క పక్క ఇళ్ళే అవడం వల్ల ఇద్దరూ కలిసి ఆడుకునేవారు. మాట్లాడుకునేవారు. అప్పుడప్పుడు పోట్లాడుకునేవారు కూడా. కాలేజీలో చదివేటప్పుడు కూడా ఇద్దరూ కలిసి కంబైన్డ్ స్టడీస్ చేసేవాళ్ళు. ఒకరి నోట్స్‌లు ఒకరు అడిగి పుచ్చుకుని రాసుకునేవారు. సుప్రియ మనసులో ఆదిత్య అంటే ఒకవిధమైన ఆరాధన, ప్రేమ, ఇష్టం, అభిమానం... అన్నీ వున్నాయి. ఆదిత్య కూడా అంతే. సుప్రియని చూడనిదే ఒక్కరోజు కూడా వుండలేకపోయేవాడు. ఇద్దరికీ ఒకరిమీద ఒకరికి ఇష్టం వున్నా పెద్దలకి దడిచి బయటపడేవారు కాదు. అప్పటికే ఎవరూ లేని సమయం చూసుకుని ఆదిత్య అన్నాడు ఒకరోజు.

''నువ్వు... చాలా అందంగా వుంటావు సుప్రియా!''

సుప్రియ అందంగా సిగ్గుపడి తల దించుకుంది.

''మరీ అంత సిగ్గయితే ఎలా? నా మనసులోని మాటను ఎలా తెలుపను ఈ సిగ్గుల మొగ్గకి?''




చొరవ చేసుకుంటూ అన్నాడు.

లేడిపిల్లలా చటుక్కున అక్కడ్నించి పారిపోయింది సుప్రియ. ఆదిత్య హాయిగా నవ్వుకున్నాడు. 'తన ప్రేమ సందేశం సుప్రియ హృదయానికి తాకింది. అంతే చాలు' అనుకున్నాడు ఆదిత్య. వాళ్లిద్దరూ ప్రేమించుకుంటున్నారన్న విషయం ఇంట్లో ఎవ్వరికీ తెలీదు. కాలేజీ చదువులు పూర్తయ్యాక ఇంట్లోవాళ్లు తనకి పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలిసి,

''నాన్నా! నేను సుప్రియని పెళ్ళి చేసుకుంటాను'' అన్నాడు ధైర్యంచేసి. ఆదిత్య తండ్రి, పరమ శివుడు మూడో కన్ను తెరిచినట్టుగా ఉగ్రుడైపోయి గట్టిగా అరిచాడు.

''మన కులం వేరు, వాళ్ళ కులం వేరు. మన అంతస్తు వేరు. వాళ్ల అంతస్తు వేరు. వాళ్లు మన అంతస్తుకి చేరుకోవడానికి ఎన్నో జన్మలు ఎత్తాలిరా. అయినా మేమంతా ప్రేమించి పెళ్లి చేసుకునే కాపురాలు చేస్తున్నామా? నోర్మూయ్యిరా. మళ్లీ నా ముందు ప్రేమ అన్న మాట ఎత్తావంటే జాగ్రత్త. నీ రెండు కాళ్లూ విరిచేసి మూలన కూర్చోపెడతాను. నా సంగతింకా నీకు తెలీదు'' విలన్‌లా అడ్డుపడ్డాడు ఆదిత్య తండ్రి!!

మరి నోరు మెదపలేదు ఆదిత్య. సుప్రియకి ఆ విషయం తెలిసింది. అప్పట్నించి ముభావంగా వుండిపోయింది. ఈరోజుల్లో, ప్రస్తుత కాల పరిస్థితుల్ని బట్టి చూస్తే ఎవరికీ ఎలాంటి అభ్యంతరాలూ వుండడం లేదు. కాని అప్పట్లో పెద్దవాళ్ళు కులం – గోత్రం అంటూ మనసారా ప్రేమించుకున్న ప్రేమికుల్ని విడదీసేవారు! పిల్లలు కూడా పెద్దవాళ్ల మీదున్న గౌరవం, అభిమానం, భయం కొద్దీ తమ మనసుల్లో వున్న ప్రేమని బయటకు చెప్పుకోలేక మనసులోనే సమాధి చేసేసుకునేవారు! ఆదిత్య, సుప్రియలది కూడా అదే పరిస్థితి. ఆదిత్యకి సుప్రియని చూస్తే సంతోషంతో కళ్లు విప్పారేవి. సుప్రియక్కూడా అంతే. ఆదిత్యను చూస్తే ఆమె మనసు పురివిప్పిన నెమలిలా నాట్యం చేసేది. తమ ప్రేమని నలుగురికీ తెలియకుండా గుండెల్లో దాచుకుని జాగ్రత్తగా ప్రవర్తించడం నేర్చుకున్నారు. వాళ్ళెప్పుడూ తోటలంట, చెరువు గట్లంటా తిరగలేదు. హద్దులు మీరి ప్రవర్తించలేదు. పెద్దవాళ్ళు ఏమంటారో, నలుగురూ నవ్విపోతారేమోనని భయం వాళ్లిద్దరికీ!

సుప్రియకి వేరే సంబంధం నిశ్చయం అయింది. ఆదిత్య మనసులోనే బాధపడ్డాడు. కాని బయటపడి అల్లరి చెయ్యలేదు. సుప్రియది పెద్దలు కుదిర్చిన సంబంధం! ఎవరూ నోరెత్తలేదు. అప్పట్లో పెద్దల నెదిరించే మనస్తత్వం పిల్లలకి వుండేది కాదు. అందుకే సుప్రియ నోరు తెరచి ఏమనకుండా అన్నింటికీ బుద్ధిగా తలూపింది. పక్కపక్క ఇళ్లే కాబట్టి ఆదిత్య సుప్రియ పెళ్లికి వెళ్లాడు. మనసు రంపంతో కోస్తున్నంతగా బాధపడుతున్నా కూడా పదిమందిలో సరదాగా తిరుగుతూ అన్ని పనులూ నెత్తినేసుకుని మరీ చేశాడు. వచ్చిన అతిథుల్ని పేరు పేరునా పలకరించి వాళ్లకి కేటాయించిన కుర్చీల్లో కూర్చోపెట్టాడు. పెళ్లిలో హడావుడంతా అతనిదే అన్నట్టుగా తిరిగాడు. సుప్రియ భర్తతోపాటు అత్తవారింటికి వెళ్లిపోవడంతో ఆ ఇంటితో ఇంచుమించు సంబంధం తెగిపోయినట్టే అనిపించింది ఆదిత్యకి. ఆ తర్వాత ఆదిత్య బి.ఇ. పాసయి హైదరాబాదులో మంచి కంపెనీలో ఇంజనీరుగా స్థిరపడ్డాడు. డి.జి.పి. గారి కూతుర్ని పెళ్లి చేసుకుని హాయిగా వున్నట్టు నటిస్తూ జీవిస్తున్నాడు!

కాలం ఎవరికోసమూ ఆగదు.

రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలూ గడిచిపోతున్నాయి!

మళ్లీ ఇన్నాళ్లకి, ఇన్నేళ్ళకి ఆదిత్యకు తన ప్రేయసిని చూసే భాగ్యం కలిగింది!! ఆమెను చూసీ చూడ్డంతోనే చుట్టూ వున్న పరిసరాలను మరిచిపోయాడు ఆదిత్య. ఒకప్పుడు, కాలేజీలో చదివే రోజుల్లో అయితే పెద్దవాళ్లంటే భయం, పిరికితనం, పదిమందీ ఏమనుకుంటారోనన్న బెరుకు వగైరా వగైరా... వుండేవి. కాని ఇప్పుడు వైవాహిక జీవితంలోని నిరాశా నిస్పృహలు తనకి బాగా ధైర్యాన్నిచ్చాయి. ఆదిత్య సంతోషం పట్టలేక ''ఇప్పుడే వస్తాను'' అంటూ గబగబా, తన వాళ్లని వదిలిపెట్టి సుప్రియని చేరుకున్నాడు.

''సుప్రియా! బాగున్నావా? ఎన్నాళ్లయింది నిన్ను చూసి! నిన్ను చూస్తుంటే, నిజం చెప్పాలంటే, నా సంతోషం సరిహద్దుల్ని దాటిపోతోంది. ఈ హాలులో వున్న వాళ్లందరూ హఠాత్తుగా మాయమైపోయి కేవలం నువ్వూ – నేనే మిగిలి వుంటే బాగుండనిపిస్తున్నది. నీతో ఎన్నో కబుర్లు చెప్పాలని వుంది. అప్పుడు భయంతో, పిరికితనంతో పెదవిదాటి పైకి రాని ఎన్నో తీయని మాటల్ని నీతో మనసువిప్పి చెప్పుకోవాలనుంది! సుప్రియా! నేను అప్పటికీ – ఇప్పటికీ – ఎప్పటికీ నిన్ను ప్రేమిస్తూనే వున్నాను. ప్రేమిస్తూనే వుంటాను'' ఆవేశంతో, ఉద్రేకంతో అన్నాడు.

సుప్రియక్కూడా అలాగే వుంది. అంత హఠాత్తుగా, అంత దగ్గరగా ఇన్ని సంవత్సరాల తర్వాత తన ప్రియబాంధవుడు కనులముందు సాక్షాత్కరించే సరికి ఆమెకి మొదట నోట మాట రాలేదు. ఆదిత్యని చూడగానే జీవితంలో పోగొట్టుకున్న పెన్నిధి తిరిగి దొరికినట్టుగా వుంది. తనూ, ఆదిత్య ఈ ప్రపంచానికి అవతలివైపుకి వెళ్ళిపోయి ఈ యుగాంతం దాకా బోలెడు తీయని కబుర్లు చెప్పుకోవాలని వుంది! అసలు ఇన్ని సంవత్సరాలుగా ఆదిత్యని తన మనసులో బంధించి పదిలంగా ప్రతిష్టించుకుందని తనకే తెలీదు. అలౌకికానందంతో ఆమె అప్రతిభురాలై చూస్తూ వుండిపోయింది. కొంతసేపటికి ఆదిత్య అన్నాడు.

''సుప్రియా! ఏమీ మాట్లాడవేంటి?''

''ఏం మాట్లాడను? ఆc... నీకు ... పెళ్ళయిందా ఆదిత్యా?''

తన పెళ్ళి మాట ఎత్తగానే ఆదిత్య మొహం ఉదాసీనంగా మారిపోయింది.

''ఆc అయింది. అదుగో అక్కడ నించుని వుందే చేతులు తిప్పుకుని మాట్లాడుతూ... ఆమే! అతిగా అలంకరణ చేసుకుని, ఆ అలంకరణ తనకి అమిరిందా, లేదా అని కూడా చూసుకోకుండా కృత్రిమంగా నవ్వుతూ పదిమందినీ ఆకర్షించాలని ప్రయత్నిస్తోందే... అదే ... నా భార్య! నా సతీమణి!''

''ఆమెని పరిచయం చెయ్యవా?'' నవ్వుతూ అంది సుప్రియ.

''పరిచయం చెయ్యతగ్గ వ్యక్తి కాదులే. ఆమెకి భేషజం ఎక్కువ. ఎంతైనా డి.జి.పి. కూతురు కదా. నిన్ను అవమానిస్తే నేను తట్టుకోలేను. వదిలెయ్యి.''

''ఏం అలా అనేస్తున్నావు?''

''అదంతే. సరే ఇంకేమైనా కబుర్లు చెప్పు. అన్నట్టు మీవారేం చేస్తున్నారు సుప్రియా?''

''ఆయనకి బ్యాంకులో ఉద్యోగం. మనిషి మంచివాడే. కొంచెం చాదస్తం ఎక్కువ. అనుమానం మనిషి!''

''అవును మరి. భార్యా రూపవతీ శత్రు! అన్నారు కదా. నీలాంటి అందమైన భార్య వుంటే ఆ మగాడికి నిముష నిముషానికీ టెన్షనే!''

''ఏయ్. ఏంటన్నావు? ఉండు చెప్తాను నీ పని'' నవ్వుతూ అతని చేతిమీద ముద్దుగా గిల్లింది. ఆ తర్వాత సడన్‌గా ఆమె బుర్ర పనిచేసింది. సిగ్గుపడి ఒకసారి చుట్టూ చూసింది. అందరూ ఎవరి హడావుడిలో వాళ్లున్నారు. కాని ఒక జత కళ్ళు ఆమెనే అబ్జర్వ్ చేస్తున్నాయని ఆమెకి తెలీదు...''

''నిన్ను అనలేదులే తల్లీ! నీ అందాన్ని పొగుడుతున్నాను.''

''అబ్బ. నీతో మాటల్లో గెలవలేను ఆదిత్యా! సరే గానీ మీ ఆవిడ్ని పరిచయం చెయ్యి.''

''ఆ ఒక్కటీ అడక్కు...'' నాటకీయంగా అన్నాడు ఆదిత్య.

ఇద్దరూ పగలబడి నవ్వుకున్నారు.

వాళ్లిద్దరూ ఎన్నో యుగాల తర్వాత కలుసుకున్నట్టుగా, జన్మజన్మలుగా వాళ్లిద్దరి మధ్యా ఏదో అవినాభావ సంబంధం వున్నట్టుగా, మళ్లీ ఈ జన్మలో తిరిగి ఎప్పుడూ కలుసుకోరేమో అన్నట్టుగా ఫుల్‌స్టాప్‌లు, కామాలు లేకుండా ఒకరి కళ్లలోకి ఒకరు తన్మయత్వంతో చూసుకుంటూ మాట్లాడేసుకుంటున్నారు!

వాళ్లు పరిసరాల్ని, చుట్టూ వున్న వాళ్లని మర్చిపోయారు! ఆదిత్య హృదయం మేఘాల్లో తేలిపోతున్నట్టుగా వుంది.

''సుప్రియా! ఇక్కడే వుండు'' అని వెళ్లి డిన్నర్ ప్లేటు నిండా రకరకాల ఐటమ్స్ వేయించి పట్టుకొచ్చి ఇచ్చాడు. తను కూడా ఒక ప్లేటు తెచ్చుకున్నాడు.

''నీకెందుకు శ్రమ ఆదిత్యా? నే వెళ్ళి తెచ్చుకునేదాన్నిగా''

''ఫర్వాలేదులే... మనం ఎంతసేపు ఇలా నించుంటాం? పద అక్కడ కుర్చీలో కూర్చుని మాట్లాడుకుందాం''

మంత్రముగ్ధలా ఆదిత్య వెనకే నడిచింది సుప్రియ.

అప్పటికి ఎన్నో జతల కళ్లు వాళ్లనే గమనిస్తున్నాయన్న విషయం ఆ సంతోషంలో వాళ్లిద్దరికీ స్ఫురణకు రాలేదు. అది వాళ్ల దురదృష్టం.

అందరికంటే ముఖ్యంగా సృజనకి భర్త ప్రవర్తన కొంచెం వింతగా, కొత్తగా అనిపించింది. కాని ఆమె అందరిముందూ త్వరగా బయటపడదు. ఆమె పెదవులు నవ్వుతూ వున్నాయి. మనసు భగ్గున మండుతోంది. భర్తని మానసికంగా ఎలా దెబ్బతియ్యాలా అని ఆలోచిస్తున్నది. ఆమె ఆలోచనలు అతని చుట్టూ తిరుగుతున్నాయి. చుట్టూ వున్నవాళ్లతో సరదాగా అసలేం జరగనట్టే నవ్వుతూ మాట్లాడుతున్నది.

ఆమె స్నేహితురాళ్లు వనజ, కాత్యాయని, పద్మారాణి, ప్రఫుల్ల అందరూ రకరకాల ప్రశ్నలతో ఆమెను విసిగించడం మొదలుపెట్టారు.

''ఎవరే ఆవిడ? మీ ఆయనతో అంతగా రాసుకు పూసుకు తిరుగుతోంది!''

''ఆవిడెవరోగాని చాలా అందంగా వుంది సుమా!''

''ఆ అద్భుత సౌందర్యరాశిని మీ ఆయన నీకు పరిచయం చెయ్యలేదేం?''

''అసలు ఈ పార్టీలో నువ్వున్నావన్న సంగతే మర్చిపోయినట్టున్నారు మీవారు!''

''ఇంతకీ ఆవిడ ఎవరు? నీకు తెలుసా?''


సృజనకి పరిస్థితి అర్థమైంది. ఆయన మీద చాలా కోపంగా వుంది. వెంటనే మొగుడ్ని నాలుగు దులిపేసి వద్దామనుకుంది. కాని అంతమందిలో ఎక్స్‌పోజ్ అవడం ఆమె మనస్తత్వానికి విరుద్ధం. నవ్వుతూ జవాబిచ్చింది.

''ఆవిడా! ఆవిడ తెలియకేం! తెలుసు. మావారికి కజిన్ సిస్టర్. మొన్ననే అమెరికా నుంచి వచ్చింది. అందుకే ఎప్పటివో కబుర్లన్నీ మాట్లాడేసుకుంటున్నారు''.

''అదేంటి సృజనా? మరి నిన్న పిలవడేంటి మీ ఆయన!''

''పిలిచారే. ఇందాక సంజ్ఞచేసి రమ్మని అన్నారు. నేను మీ అందరితో మాట్లాడుతున్నాను కదా.






అందుకే నేను రానని సంజ్ఞచేసి చెప్పేశానులే. మాట్లాడుకోనీవే. పాపం ఈ ఫంక్షను అయిందాకే కదా. ఆ తర్వాత ఎవరి దారి వారిది!'' అర్థవంతంగా అని అందర్నీ చూసి నవ్వేసింది సృజన.

అదేదో పెద్ద విషయం కానట్టు అందర్నీ నమ్మించింది. కాని మనసు మండిపోతున్నది. ఆదిత్య ప్రవర్తన అంతుపట్టడం లేదు. ఎప్పుడు... ఏ ఫంక్షనుకి వచ్చినా ఉదాసీనంగా, ముభావంగా తనకేమీ పట్టనట్టుగా వుంటాడు! మరి ఆ వగలాడి ఎవరోగాని తన భర్తని ఆమె చుట్టూ తిప్పుకుంటున్నది! చెప్తాను. వాళ్ల సంగతి! అగ్నిసాక్షిగా తాళికట్టిన భార్యను .... ఎదురుగా పెట్టుకుని ఆమెతో ఆ పరాచికాలేంటి? నా సంగతి అతను పూర్తిగా మర్చిపోయినట్టున్నారు? నాక్కోపం వస్తే ఏం చేస్తానో అతనికి తెలియనట్టుంది.

............

గతంలో జరిగిన సంఘటనలు, ఆదిత్య, సుప్రియల ప్రేమ, ఇద్దరూ ఒకర్నొకరు ఇష్టపడడం, సరదాగా కబుర్లు చెప్పుకుంటూ గడపడం, పరీక్షలప్పుడు కంబైన్డ్ స్టడీస్, ఆదిత్య చిలిపిగా సుప్రియని ఏదో ఒక దానికి ఏడిపించడం, ఆఖరికి వాళ్ల ప్రేమ అన్ని ప్రేమకథల్లాగే పెద్దవాళ్లు అడ్డుపడ్డం, ప్రేమలో వాళ్లిద్దరూ ఓడిపోవడం, పెద్దవాళ్ల నిర్ణయాన్ని కాదనలేక జీవితంలో తప్పనిసరిగా రాజీపడిపోయి బ్రతకడం... ఇవన్నీ వాళ్లు అస్సలు మర్చిపోలేదు. మర్చిపోయే సంఘటనలు కావు అవి! ఇన్ని సంవత్సరాలైనా, పుష్కరకాలం దాటినా ఆ జ్ఞాపకాలన్నీ వాళ్లిద్దరి గుండెల్లో పదిలంగా వున్నాయి!!

అప్పుడంటే తెలిసీ – తెలియని జ్ఞానం, భయం, పిరికితనం, వాళ్లనరాల్లో జీర్ణించుకుపోయాయి. ఎవర్నీ ఎదిరించలేని మనస్తత్వంతో మానసికంగా కృంగిపోయారు! ఇన్ని సంవత్సరాల తర్వాత ఒకరికొకరు తారసపడగానే వాళ్ల మనసుల్లో వున్న ప్రేమ – అభిమానం అన్నీ గంగాప్రవాహంలా పొంగిపొరిలాయి. అందుకే ఇప్పుడు వాళ్లిద్దరూ వేరువేరు వ్యక్తులతో కాపురాలు చేస్తున్నా, తమల్ని వేరు చెయ్యడానికి కారణభూతమైన పెద్దవాళ్ల మీద, ఈ కట్టుబాట్లు నియమించిన సమాజంలోని వ్యక్తుల మీద కసి, కోపం, ఉక్రోషం పెంచుకున్నారు! అందుకే వాళ్లు అలా ప్రవర్తిస్తున్నారు!?

వైవాహిక జీవితంలోని ఎన్నో అనుభవాలు వాళ్లిద్దరికీ ఎన్నో జీవిత పాఠాలను నేర్పాయి. వాళ్లిద్దరూ ఒకర్నొకరు చూసుకున్నప్పుడు నిజంగానే పది నిమిషాల వరకు పరిసర జ్ఞానాన్ని కోల్పోయారు. కాని తర్వాత కావాలనే, అందరూ తమని గమనిస్తున్నారని తెలిశాక కూడా, వాళ్లు దగ్గరగా నుంచుని, పక్కపక్క కుర్చీల్లో కూర్చుని కబుర్లు చెప్పుకోవడం మానలేదు.

సృజనకి అంతా తెలిసిపోయిందన్న సంగతి ఆదిత్యకి తెలుసు! ఆదిత్య భయపడలేదు.

''ఏం? సృజన ఏం చేస్తుంది? చంపేస్తుందా తను సిద్ధం. విడాకులిచ్చేస్తుందా? దానికీ తను సిద్ధం. అన్నిటికీ తను సిద్ధంగానే వున్నాడు. తను తప్పు చెయ్యలేదు. ఎవరి శీలాన్ని దోచుకోలేదు. ఎవరి కాపురాన్ని కూల్చలేదు. పెళ్లాం వుండగా మరొకర్తెని పెళ్లి చేసుకోలేదు. నీతిబాహ్యమైన పనేవీ తను చెయ్యలేదు! మరెందుకు తను భయపడాలి? ఎవరికి భయపడాలి?'' అనుకున్నాడు ఆదిత్య మొండిగా.

రాబోయే పరిణామాల్ని ఊహించి కూడా తను సుప్రియతో కొన్ని క్షణాలైనా సంతోషంగా గడపాలని నిశ్చయించుకున్నాడు! ఆ సంతోష సమయాన్ని, ఆ కొన్ని క్షణాల్ని ... ఒక తీయని జ్ఞాపకంగా మనసులో పదిలపర్చుకోవాలని ఆదిత్య ఆశించాడు!

సుప్రియ, తన భర్త, పిల్లలతో అదే వూర్లో వుంటున్నా కూడా ఆదిత్య ఎప్పుడూ ఆమెకి ఎదురుపడలేదు. అతను డి.జి.పి. గారి అల్లుడు మరి! ఎప్పుడూ పెళ్లాంతోపాటు ఎ.సి. కార్లలో తిరగడం తప్ప ఆటో ఎక్కడు! నడిచి వెళ్లడు!

ఫంక్షన్ పూర్తయ్యాక ఆదిత్య తన ఫోన్ నెంబర్ సుప్రియకిచ్చి సుప్రియ ఫోన్ నెంబర్ తను నోట్ చేసుకున్నాడు. ఇదంతా దూరంనుంచి సృజన చూస్తూనే వుంది!?

ఆదిత్య, సుప్రియ ఒకరికొకరు బరువెక్కిన మనసులతో వీడ్కోలు చెప్పుకున్నారు. అడుగులు ముందుకు పడుతుంటే సుప్రియ నీళ్లు నిండిన కళ్ళతో వెనక్కి తిరిగి చూసింది. ఆదిత్య తననే తదేకంగా చూస్తున్నాడు. ఒక్కసారి పరుగెత్తుకెళ్లి అతని చేతుల్లో వాలిపోవాలని, అతని గుండెలో తలదాచుకోవాలని అనిపించింది! కాని పెళ్లయి పన్నెండు సంవత్సరాలై, భర్తతో కాపురం చేస్తూ, ఇద్దరు పిల్లలకి తల్లి అయిన ఆమె అంత ధైర్యం చెయ్యలేకపోయింది!!

సృజన మొదట్నుంచీ తన స్నేహితురాళ్లతో మాట్లాడుతున్నా, తన తండ్రితో మాట్లాడుతున్నా ఓరకంటితో ఆదిత్య, సుప్రియల వ్యవహారం అంతా కనిపెడుతూనే వుంది. సుప్రియ వెళ్లిపోయాక సృజన కృత్రిమ మందహాసం చేస్తూ ఆదిత్య పక్కకి చేరింది.

''ఏమిటి! ఇవాళ మీరు చాలా సంతోషంగా కనిపిస్తున్నారు? ఎప్పుడూ మీ కళ్లల్లో, మీ మొహంలో ఇంత ఉత్సాహం నేను చూడలేదు!'' సృజనకి పబ్లిక్ ముందు ఎలా ప్రవర్తించాలో బాగా తెలుసు. ముఖ్యంగా కీలెరిగి వాతలుపెట్టడం ఆమెకి వెన్నతో పెట్టిన విద్య.

''ఆc... ఆc... అహ... అదేంటి సృజనా అలా అంటావు? నేనెప్పుడూ హేపీగానే వుంటాను. అయామ్ ఆల్వేస్ హేపీ!'' అన్నాడు ఆదిత్య తడబాటుని కప్పిపుచ్చుకుంటూ.

''ఓ.కే. మీరలా ఎప్పుడూ హేపీగా వుండడమే నాక్కావల్సింది'' అంది.

తన పెదవుల లిప్‌స్టిక్‌ని నాలుకతో సరిచేసుకుంటూ, పళ్లన్నీ కనపడేలా నవ్వుని కూడా ముఖానికి పులుముకుంటూ, ఇంకొక స్నేహితురాలొచ్చి పలకరించగానే ''హాయ్'' అని ఆమెకి విష్‌చేసి హడావుడిగా వెళ్లిపోయింది సృజన.

''ఇది తుఫాను హెచ్చరిక! తొందర్లో తుఫాను తప్పదు'' అనుకున్నాడు ఆదిత్య.

ఆదిత్య, సృజనలు ఇంటికొచ్చారు. ఇంటికి వచ్చీ రాగానే లోపలికి వెళ్లి గీజరు ఆన్‌చేసింది. తర్వాత వేడినీళ్లతో స్నానంచేసి వచ్చి పెర్‌ఫ్యూమ్ స్ప్రే చేసుకుని, పల్చటి నైటీ వేసుకుని ఫ్రెష్ అయి వచ్చింది సృజన. అప్పటికే ఆదిత్య మెత్తటి కుషన్ పరుపు మీద నిద్రపోవడానికి ఉపక్రమిస్తున్నాడు! సృజన భర్త పక్కన చేరి అతని భుజంమీద చేయివేసింది.

''ఏంటి... అంతా నిద్రేనా? యాక్టింగు చాలుగాని, లేవండి. ఊc... లేవండి'' ఆమె కంఠస్వరం నెమ్మదిగానే వున్నా చివరిమాట దగ్గరకొచ్చేసరికి తీక్షణంగా మారింది.

ఆదిత్య దిగ్గున లేచి కూర్చున్నాడు.

''అదెవర్తో... మీతో అంత క్లోజ్‌గా మాట్లాడు

తోంది?''

ఆదిత్య భయపడినంతా జరిగింది.

కోర్టులో ముద్దాయిని నిలదీసినట్టు అడుగుతున్నది సృజన.

''నిజం చెప్పండి. ఆమె ఎవరు? ఆమెకు మీకు గల సంబంధం ఏమిటి? నా దగ్గర బుకాయించడానికి ప్రయత్నించవద్దు. మొదట్నుంచి మీ ఇద్దరి వ్యవహారం కనిపెడుతూనే వున్నాను!'' పళ్ళు పటపట కొరుకుతూ గట్టిగా అరిచింది సృజన.

ఆదిత్య ఈసారి నిజంగానే భయపడిపోయాడు.

పులిలాంటి పెళ్ళాం ముందు అతను పిల్లిలా అయిపోతాడు!? అప్పటిదాకా మనసులో చెప్పుకున్న ధైర్య వచనాలన్నీ ఒక్కసారిగా నీరుగారిపోయాయి!

అయినా ఆదిత్య ఎలాగో నోరు పెకిలించుకుని అన్నాడు. ''ఆమె నా చిన్నప్పటి స్నేహితురాలు. మేం పక్కపక్క ఇళ్ళల్లో వుండేవాళ్ళం. అంతే. ఎప్పుడో చిన్నప్పుడు ఆమెని చూశాను. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు చూడ్డమే. మొదట నేనసలు ఆమెని పోల్చుకోలేకపోయానంటే నమ్ము'' బింకంగా పలికాడు ఆదిత్య.

''మీ కంటికి నేనెలా కనిపిస్తున్నాను? మీరు చెప్పే కల్లబొల్లి కబుర్లన్నీ నమ్మేదానిలా కనిపిస్తున్నానా? వెధవ వేషాలెయ్యకండి. నాకంతా తెలుసు'' ఉరిమినట్లుగా చూస్తూ అరిచింది మళ్ళీ ఆమె.

''నిజం చెప్పండి. ఆమె ఎవరు? ఆమెకు మీకు గల సంబంధం ఏమిటి? నా దగ్గర బుకాయించడానికి ప్రయత్నించవద్దు. మొదట్నుంచి మీ ఇద్దరి వ్యవహారం కనిపెడుతూనే వున్నాను!'' పళ్ళు పటపట కొరుకుతూ గట్టిగా అరిచింది సృజన.

సృజన చాలా తెలివైనది. ముందుచూపు గలది. సృజన తెలివితేటల్ని తక్కువ అంచనా వేశాడు ఆదిత్య.

తర్వాత కొన్ని రోజులకే ఆదిత్యకి తెలియకుండా రహస్యంగా సుప్రియ భర్తకి ఆ వూర్నించి ట్రాన్స్‌ఫర్ అవడం, వాళ్లు ఆ వూర్నించి వెళ్లిపోవడం కూడా జరిగిపోయింది. ఆమె తన తండ్రి పరపతిని ఉపయోగించి అలా చేయించిందని ఆదిత్యకి తెలిసే అవకాశం లేదు. అంతేకాదు అప్పటిదాకా ఇంట్లో వున్న రిలయన్స్ ఫోన్ తీసేసి బి.ఎస్.ఎన్.ఎల్. ఫోన్ పెట్టించేసింది. ఫోన్ నెంబర్ మారిపోయింది. మొబైల్ ఫోన్ కూడా కొత్తది తీసుకుంది. ఆదిత్య బిక్కమొహం వేశాడు. సృజన అక్కడితో ఆగలేదు. భర్త నిద్రపోతున్న సమయంలో అతను ఎక్కించుకున్న సుప్రియ ఫోన్ నెంబర్‌ని మాయం చేసేసింది. తన భర్తని మరొకరితో పంచుకోవడం ఊహల్లో కూడా ఆమె భరించలేదు. అది ప్రేమ అనేకంటే అధికారం, అహంభావం, సెల్ఫ్ ఇగోయిజం అంటేనే బాగుంటుంది! అందుకే ఆదిత్య వ్యవహారం ఇంకా దూరం వెళ్లకముందే అన్ని జాగ్రత్తలూ తీసుకుంది సృజన.

ఆదిత్య మనసంతా చేదు తిన్నట్టుగా అయిపోయింది. మొదట కొంతసేపు అతని మెదడు మొద్దుబారిపోయింది. అతని మనసులో భార్య మీదున్న కోపం, అసహ్యం ఇంకా రెట్టింపయ్యాయి. కాని ఆలోచిస్తున్నకొద్దీ మనసుతో రాజీపడ్డం మంచిదని అతనికి అనిపించింది. సృజన తడిగుడ్డతో గొంతు కోసే రకం అని, అమృతంలో విషం కలిపి నవ్వుతూ నోటికందించే ఆధునిక రాక్షసి అని అతను గ్రహించాడు. ఏదిఏమైనా ఫంక్షన్ రోజున తన ఆరాధ్య దేవత... తన సుప్రియని కనులారా చూడ్డం, మనసు విప్పి మాట్లాడ్డం, కొన్ని గంటలు ఆమెతో హాయిగా, ఆనందంగా గడపడం... అంతా ఒక తీయని జ్ఞాపకంలా మిగిలిపోయినందుకు అతనికి చాలా సంతోషంగా వుంది.

''ఈ జీవితానికీ సంతోషం చాలు'' అనుకున్నాడు ఆదిత్య తృప్తిగా!

★

# స్టీమ్ బాత్



మార్కెట్లో కొత్త వస్తువుల వినియోగం ఎక్కువవుతోంది. దీంతోపాటు వినియోగదారులు కూడా తమ ఆలోచనలకు తగ్గ వస్తువులను వాడటంలో ముందంజ వేస్తున్నారు. ఇక చర్మసౌందర్యం, గ్లామర్ రంగంలో వీటి గురించి చెప్పాల్సిన అవసరం లేదు. స్నానపు గదుల్లో అయ్యే ఫ్రెషప్ ముగింపు డ్రెస్సింగ్ టేబుల్ వద్ద సింగారానికి నాంది అన్నట్టు ఇప్పుడు సింగారం కూడా బాత్‌రూముల్లోనే జరిగితే ఆనంద పడని వారెవరుంటారు. అదికూడా ఆరంభమయ్యింది.

ఇటీవలే లింకో కంపెనీ వారు బ్యూటీ మరియు స్లిమ్మింగ్ పరికరాలను సృష్టించడంలో మరో ముందడుగు వేశారు. నిత్యం కొత్తదనాన్ని కోరుకునే వారికి ఇదొక పులకరింతగా చెప్పుకోవచ్చు. వీళ్ళు ఈ మధ్యనే స్టీమ్ బాత్ మరియు హాట్ వాటర్‌తో కూడిన స్నానపు పరికరాన్ని మార్కెట్లోకి తెచ్చారు. ఇది సుమారు 32 వేల రూపాయల వరకూ వుంటుంది. దీనివల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. హీటర్ లేదా గీజర్ వేసుకున్న దానికంటే ఇది మంచి పవర్ సేవర్‌గా పనికొస్తుంది. 30 నిముషాలు స్టీమ్ బాత్‌ను వాడితే ఒక్క యూనిట్ మాత్రమే పవర్ వినియోగమవుతుంది. స్టీమ్‌తో పాటు గీజర్ కూడా కలిగిన దీంట్లో ఎస్1, ఎస్2 అంటూ ఆరు మోడళ్లను లింకో వారు మార్కెట్లోకి వదిలారు. గీజర్ కాకుండాస్టీమ్ యంత్రమే బయట 80 వేల వరకూ ధర వుంది. ఇది మాత్రం 32 వేలకు వస్తుంది. ఇది బాత్‌రూమ్‌లోనే కాకుండా ఇంట్లో ఎక్కడైనా అమర్చుకుని స్నానం చేసే అవకాశముంది.

స్టీమ్ బాత్ వల్ల ఒత్తిడి తగ్గుతుంది. శరీరం రిలాక్స్ అవుతుంది. ఫ్రెష్‌గా అవ్వొచ్చు. కండరాల బాధ తగ్గిపోతుంది. కీళ్ల నొప్పులు తగ్గే అవకాశముంది. ఆర్థరైటీస్‌తో బాధపడే వారు విముక్తి పొందచ్చు. చర్మ సౌందర్యం ఇనుమడిస్తుంది. బ్రీతింగ్, ఆస్తమా లాంటి సమస్యలనుంచి విముక్తి పొందచ్చు. ఇంకా దీనివల్ల చాలా ఉపయోగాలున్నాయి. స్టీమ్‌బాత్ కమ్ గీజర్ ఫెసిలిటీ వున్న వీటికి ఇప్పుడు మార్కెట్లో మంచి ఆదరణ లభిస్తోంది. ఇదే కాదు సుమారు స్లిమ్మింగ్ మరియు బ్యూటీ రంగంలో ఈ కంపెనీ మరో 30 ఉత్పత్తులను విడుదల చేసింది.